క్లుప్తంగా

ఇన్‌చార్జ్ ఆర్డీఓగా రమణారెడ్డి


బాధ్యతలు స్వీకరిస్తున్న రమణారెడ్డి

చండూరు : దేవరకొండ ఆర్డీఓగా పనిచేస్తున్న చామల రమణారెడ్డి శుక్రవారం చండూరు ఇన్‌చార్జ్ ఆర్డీఓగా బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఆర్డీఓ శ్రీదేవి 37 రోజులపాటు విదేశాలకు వెళ్లడంతో రమణారెడ్డికి అదనపు బాధ్యతలు అప్పగించారు. అనంతరం కార్యాలయ సిబ్బందితో ఆయన సమావేశమయ్యారు.

భవిత కేంద్రాన్ని సందర్శించిన ఆర్డీఓ

చండూరు పట్టణ కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేస్తున్న భవిత కేంద్రాన్ని చండూరు ఇన్‌చార్జ్ ఆర్డీఓ చామల రమణారెడ్డి సందర్శించారు. పనులు త్వరగా పూర్తిచేసి రానున్న విద్యాసంవత్సరానికి భవనాన్ని అందుబాటులోకి తీసుకురావాలని ఎంఈఓ సుధాకర్‌కు సూచించారు. ఆయన వెంట చండూరు ఆర్డీఓ కార్యాలయ డీటీ పరమేష్, చండూరు డిప్యూటీ తహసీల్దార్ నిర్మల, ఆర్ఐ శేఖర్ తదితరులు ఉన్నారు.

బోధన పద్ధతులపై దృష్టి సారించాలి

చండూరు ఉపాధ్యాయులు విద్యాబోధన పద్ధతులపై దృష్టి సారించాలని చండూరు ఇన్‌చార్జ్ ఆర్డీఓ చామల రమణారెడ్డి అన్నారు. చండూరు జిల్లా పరిషత్ పాఠశాలలో జరుగుతున్న ఉపాధ్యాయుల వృత్యంతర శిక్షణ తరగతులకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో ఎంఈఓ సుధాకర్, మాస్టర్ ట్రైనర్‌లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎల్‌ఓసీ అందజేత

మునుగోడు: కొరటికల్ గ్రామానికి చెందిన ఆర్.శిరీష అనారోగ్యానికి గురై హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. కాగా ఆమెకు స్థానిక ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సహకారంతో మంజూరైన రూ.లక్షా 50వేల విలువ గల ఎల్‌ఓసీని కాంగ్రెస్ పార్టీ మండల నాయకుడు బీరప్ప శుక్రవారం ఆమె కుటుంబ సభ్యులకు అందజేశారు.

విద్యార్థులకు పారితోషికం


నగదు అందజేస్తున్న నాయకులు

తిప్పర్తి : ఇటీవల విడుదలైన పదో తరగతి ఫలితాల్లో తిప్పర్తి మండల కేంద్రంలోని హైస్కూల్‌లో 500 మార్కులపైన సాధించిన విద్యార్థులకు ప్రతీక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో దాత పాశం నరేశ్‌రెడ్డి శుక్రవారం పారితోషికం అందజేశారు. ప్రథమ స్థానం పొందిన విద్యార్థినికి రూ.10వేలు, మరో ఆరుగురు విద్యార్థులకు ఐదువేల రూపాయల చొప్పున అందజేశారు. ఎంఈఓ నర్సింహనాయక్ మార్కెట్ చైర్మన్ జూకూరి రమేష్, డీసీసీబీ డైరెక్టర్ పాశం సంపత్‌రెడ్డి, చింతకుంట్ల రవీందర్‌రెడ్డి, ప్రతీక్ ఫౌండేషన్ సీఈఓ గోనారెడ్డి, బద్దం సుధీర్, నాయకులు పాదూరి శ్రీనివాస్‌రెడ్డి, మోష, ఉపాధ్యాయుడు సదానందం పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

గట్టుప్పల్ : మండలంలోని నామాపురం గ్రామానికి చెందిన బొల్లోజు జెన్నయ్య ఇటీవల అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్యచికిత్స చేయించుకున్నాడు. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి చొరవతో వైద్య ఖర్చుల నిమిత్తం జెన్నయ్యకు మంజూరైన రూ.60 వేల విలువ గల సీఎం సహాయ నిధి చెక్కును శుక్రవారం ఆ గ్రామ మాజీ సర్పంచ్ సంపత్ అందజేశారు. కార్యక్రమంలో సురిగి వెంకటేష్, మద్ది లింగయ్య, తోటకూరి వీరయ్య, చెనగోని యాదయ్య, బొల్లోజు నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

వాటర్‌ప్లాంట్ నిర్మాణానికి భూమిపూజ

శాలిగౌరారం: ఉద్యోగ రీత్యా ఇతర జిల్లాల్లో విధులు నిర్వర్తిస్తూ అక్కడే స్థిర నివాసం ఉంటున్నా.. సొంత ఊరికి ఉపకారం చేయాలనే లక్ష్యంతో గ్రామంలో ఉచితంగా ప్యూరిఫైడ్ వాటర్‌ప్లాంటు నిర్మాణానికి పూనుకున్నారు మండలంలోని అంబారిపేట గ్రామానికి చెందిన ఇద్దరు ఉద్యోగులు. అంబారిపేట గ్రామానికి చెందిన ఎర్ర శంకరయ్య ప్రస్తుతం మేడ్చల్ మండల విద్యాశాఖాధికారిగా, సుంచు సైదులు మేడ్చల్ జిల్లా జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్నారు. శంకరయ్య తన తల్లిదండ్రులు ఎర్ర నర్సయ్య–సాలమ్మ జ్ఞాపకార్థం, సైదులు తన తల్లి సుంచు ముత్తమ్మ జ్ఞాపకార్థం రూ.5 లక్షలతో గ్రామంలో వాటర్‌ప్లాంట్ నిర్మాణానికి శుక్రవారం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో సీఐ సైదులు తండ్రి సుంచు సోమయ్య, మాజీ సర్పంచ్ మాతంగి శ్రీనివాసులు, కాంగ్రెస్ నాయకులు గర్దాసు లింగయ్య, లింగాల శేఖర్, బీఆర్‌ఎస్ నాయకులు తోట సోమయ్య, మాగి రవి, బీజేపీ మండల అధ్యక్షుడు తోట వినోద్, సీపీఎం మండల కార్యదర్శి చలకాని మల్లయ్య, జగన్, నాగరాజు, వెంకన్న పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాలు ఏర్పాటు

చిట్యాల: మండలంలోని పెద్దకాపర్తి గ్రామం 11వ వార్డులో ప్రజల అవసరాలకు అనుగుణంగా వీధుల్లో విద్యుత్ స్తంభాలు లేక ఇబ్బందులు పడ్డారు. ఈ విషయాన్ని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం దృష్టికి తీసుకెళ్లడంతో శుక్రవారం ఆ వార్డులో విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేశారు.

ముమ్మరంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం

- నకిరేకల్ నియోజకవర్గానికి తొలి విడత 3500 ఇళ్లు మంజూరు
- అదనంగా ప్రభుత్వాన్ని మరో రెండు వేల ఇళ్లు కోరిన ఎమ్మెల్యే

నకిరేకల్ : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు నకిరేకల్ నియోజకవర్గంలోని ఆరు గ్రామాల్లో ముమ్మరంగా సాగుతున్నాయి. నకిరేకల్ పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఇందిరమ్మ మోడల్ ఇంటిని నిర్మించారు. నియోజకవర్గ వ్యాప్తంగా నకిరేకల్, కేతేపల్లి, కట్టంగూరు, నార్కట్‌పల్లి, చిట్యాల, రామన్నపేట మండల కేంద్రాల్లో రూ.5లక్షలతో మోడల్ ఇళ్లను (హౌజింగ్ కార్యాలయం) చేపట్టారు. నకిరేకల్‌లో పూర్తయిన మోడల్ ఇంటిని ఇటీవల రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించిన విషయం తెలిసిందే. ఈ నమూనా ఇళ్ల నిర్మాణ పనులు మిగతా మండల కేంద్రాల్లో కొనసాగుతున్నాయి.


నెల్లిబండలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇల్లు

ఇళ్ల కోసం దరఖాస్తులు ఇలా..

మండలం	ఇంటి స్థలం ఉండి ఇల్లు లేనివారు	ఇల్లు, ఇంటి స్థలం లేనివారు	ఇల్లు ఉన్న వారు
నకిరేకల్	4506	983	3665
కేతేపల్లి	5137	1185	4,171
కట్టంగూర్	5773	1968	5422
నార్కట్‌పల్లి	6028	1123	12852
రామన్నపేట	4675	1390	7850
చిట్యాల	704	30	--
మున్సిపాలిటీల్లో			
నకిరేకల్	9149	1849	1706
చిట్యాల	815	1107	1146
మొత్తం	36,787	9,635	36,812

మూడు విభాగాలుగా విభజించిన అధికారులు

నకిరేకల్ నియోజకవర్గంలోని ఆరు మండలాలకు కలిపి మొదటి విడతలో 3500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయి. నియోజకవర్గ వ్యాప్తంగా మొత్తం 83,234 మంది ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తులు పెట్టుకున్నారు. వీటిని అధికారులు మూడు విభాగాలుగా విభజించారు. వీరిలో ఇంటి స్థలం ఉండి ఇల్లు లేని వారికి మొదటి ప్రాధాన్యతలో 36,787, ఇల్లు, ఇంటి స్థలం లేనివారికి రెండో ప్రాధాన్యతలో 9,635, ఇల్లు ఉన్నవారికి మూడో ప్రాధాన్యతలో 36,812 చొప్పున దరఖాస్తులను విభజించారు. గెజిటెడ్ స్థాయి అధికారితో గ్రామాలవారీగా టీంను పంపించి విచారణ చేసి పూర్తి పారదర్శకంగా ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది.

మండలానికి ఒక గ్రామం చొప్పున ఎంపిక

తొలి విడతలో మండలానికి ఒక గ్రామం చొప్పున ప్రభుత్వం పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసింది. ఒక్కో ఇంటిని 400 నుంచి 600 చదరపు అడుగుల్లోపే నిర్మించుకోవాలనే నిబంధన విధించారు. నకిరేకల్ మండలం నెల్లిబండలో 44, కేతేపల్లి మండలం ఇప్పలగూడెంలో 34, కట్టంగూరు మండలం భాస్కర్లబాయిలో 44, చిట్యాల మండలం వట్టిమర్తిలో 56, నార్కట్‌పల్లి మండలం జువ్విగూడెంలో 79, రామన్నపేట మండలం ఉత్తటూర్‌లో 87 చొప్పున ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసి పనులు చేపట్టారు. ఆయా గ్రామాల్లో ఇప్పటికే ఇంటి బునాది, బేస్మెంట్, పిల్లర్ల స్థాయిలో పనులు కొనసాగుతున్నాయి.

అర్హులైన వారందరికీ ఇళ్లు ఇస్తాం



ఇందిరమ్మ పథకం కింద నకిరేకల్ నియోజకవర్గానికి మొత్తం 3500 ఇళ్లను ప్రభుత్వం అధికారికంగా మంజూరు చేసింది. అదనంగా మరో రెండు వేల ఇళ్లు కావాలని, సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిల దృష్టికి తీసుకెళ్లా. వారు సానుకూలంగా స్పందించారు. తొలి దశలో అసలు ఇల్లు లేని పేదలకు ప్రాధాన్యత ఇస్తాం. దశల వారీగా ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హత కలిగిన వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు తప్పక ఇస్తాం.

– వేముల వీరేశం, ఎమ్మెల్యే నకిరేకల్

పనిచేయని కార్యదర్శులను బదిలీ చేయండి

- మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి


అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

మునుగోడు: గ్రామ పంచాయతీ కార్యదర్శులు అంకితభావంతో పనిచేస్తేనే గ్రామాభివృద్ధి జరుగుతుందని, కొందరు కార్యదర్శులు పట్టించుకోవడం లేదని, అలాంటి కార్యదర్శులను నియోజకవర్గం నుంచి బదిలీ చేయాలని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అధికారులకు సూచించారు. శుక్రవారం మునుగోడులోని క్యాంపు కార్యాలయంలో డీపీఓ వెంకయ్యతోపాటు ఎంపీడీఓ, పంచాయతీ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతిరోజు మురికి కాల్వలు, వీధులను శుభ్రం చేయించి గ్రామాలు అద్దంలా మెరిసేలా చొరవచూపాలన్నారు. కొందరు కార్యదర్శులు అంతంత మాత్రంగానే పనిచేస్తున్నారని తన దృష్టికి వచ్చిందన్నారు. అలాంటి వారిని అధికారులు గుర్తించి వారి పనితీరు మెరుగుపడేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అదేవిధంగా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలకు అర్హులను గుర్తించడంలో ఎలాంటి తప్పులకు తావు ఇవ్వొద్దని, అర్హులను మాత్రమే గుర్తించి సంక్షేమ పథకాలు అందేలా చొరవ చూపాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి, ఎంపీడీఓ విజయభాస్కర్, మండల పంచాయతీ అధికారి స్వరూపరాణి, మునుగోడు, చండూరు మండలాల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

వెదిరె కుటుంబానికి పరామర్శ

మునుగోడు మండలంలోని కొంపల్లి గ్రామానికి చెందిన వెదిరె మేఘారెడ్డి తండ్రి వెదిరె మధుసూదన్‌రెడ్డి ఇటీవల మృతి చెందారు. శుక్రవారం కొంపల్లిలోని వారి నివాసంలో బాధిత కుటుంబాన్ని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి పరామర్శించి మధుసూదన్‌రెడ్డి చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు.

మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ

నల్లగొండ టౌన్ : రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి జన్మదినం సందర్భంగా శుక్రవారం సుశ్రుత గ్రామీణ వైద్యుల సంఘం ఆధ్వర్యంలో నల్లగొండ జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పుడమి సాహితి వేదిక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ చిలుముల బాల్‌రెడ్డి, న్యూ కంబాల శివలీల ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు డాక్టర్ కంబాల శివలీల, ఆర్‌ఎంపీ బిక్షాల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

- ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

నార్కట్‌పల్లి : జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను తక్షణమే పూర్తి చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం నార్కట్‌పల్లి మండల కేంద్రంలో జరిగిన సీపీఐ 7వ మండల మహాసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని బహుళ జాతి సంస్థలకు తాకట్టు పెడుతూ కార్మికుల హక్కులను కాలరాస్తోందన్నారు. బి.వెల్లెంల ప్రాజెక్టు, ధర్మారెడ్డిపల్లి, ఆసిఫ్‌నహర్ కాలువ అక్కెనపల్లి నుంచి ఆకారం గ్రామం వరకు పూర్తి చేయడానికి సీపీఐ ఆధ్వర్యంలో ఉద్యమాలు చేయాలని పిలుపునిచ్చారు. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా బి.వెల్లంల ప్రాజెక్టు, ఎస్‌ఎల్‌బీసీ సొరంగం, ధర్మారెడ్డిపల్లి కాలువలు నేటి వరకు పూర్తి కాలేదన్నారు. బీజేపీ ప్రభుత్వం పాకిస్తాన్‌తో శాంతి చర్చలు జరుపుతూ, దేశ పౌరులైన నక్సలైట్లతో చర్చలు ఎందుకు జరపడం లేదని ప్రశ్నించారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి లొడంగి శ్రవణ్‌కుమార్ మాట్లాడుతూ నార్కట్‌పల్లి మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలకు నిధులు కేటాయించి పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. సంగిశెట్టి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన మహాసభలో సీపీఐ మండల కార్యదర్శి పెండ్యాల శంకర్, బీకేఎంయూ నియోజకవర్గ అధ్యక్షుడు వెంపటి శ్రీనివాస్, మండల సహాయ కార్యదర్శి వంగాల నాగయ్య, ఆలకుంట్ల నర్సింహ, అనంతరెడ్డి, నర్సింహ, వెంకట్‌రాములు, యోగేంద్రరెడ్డి, గోపాల్‌రెడ్డి, మల్లేష్, సైదులు, రాణమ్మ, పెండ్యాల పద్మ, మంటిపల్లి సైదమ్మ, వస్కుల లక్ష్మి తదితరులున్నారు.

మకర తోరణం బహూకరణ


పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

శాలిగౌరారం : శాలిగౌరారం ప్రాజెక్టు వద్ద శ్రీసీతారామచంద్రస్వామి ఆలయం సమీపంలో గల పురాతన ఆంజనేయస్వామి ఆలయానికి మండల కేంద్రానికి చెందిన విశ్రాంత లెక్చరర్, ప్రముఖ కవి గురిజాల వెంకటేశ్వరశర్మ–రమాదేవి దంపతులు శుక్రవారం ఇత్తడి మకరతోరణాన్ని బహూకరించారు. ఈ సందర్భంగా ఆలయంలోని ఆంజనేయ స్వామి విగ్రహానికి శ్రీసీతారామచంద్రస్వామి ఆలయ వంశపారంపర్య ధర్మకర్తలు శేషభట్టర్ రత్నమాచార్యులు, నర్సింహాచార్యులు, జగన్మోహనాచార్యులు మకర తోరణాన్ని అలంకరించి ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో శాలిగౌరారం, తిరుమలరాయునిగూడెం గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

డీఎల్‌పీవో విచారణ

మర్రిగూడ : మండలంలోని వట్టిపల్లి గ్రామంలో అక్రమంగా చేపట్టిన ఇంటి నిర్మాణంపై డీఎల్‌పీవో శంకర్‌నాయక్ శుక్రవారం గ్రామపంచాయతీ కార్యాలయంలో విచారణ చేపట్టారు. గ్రామానికి చెందిన శ్రీనివాస్‌రెడ్డి మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయించడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అధికారులు స్పందించారు. కొంతకాలంగా తండ్రీ కొడుకుల మధ్య జరుగుతున్న ఈ భూ వివాదంలో గ్రామపంచాయతీ మౌలిక సదుపాయాలు, ఇంటి టాక్స్ వసూళ్లపై అనుమానాలు తలెత్తిన నేపథ్యంలో డీఎల్‌పీవో విచారణ చేపట్టారు. ఎంపీఓ బండారు రవికుమార్, గ్రామపంచాయతీ కార్యదర్శి వంశీకృష్ణ సమక్షంలో తండ్రీకొడుకులు వారి సమస్యను వివరించారు. అక్రమ నిర్మాణానికి పంచాయతీ ఎలా అనుమతులు మంజూరు చేసింది, పన్ను వసూలు ఎలా జరుపుతున్నారనే విషయంలో డీఎల్‌పీవో విచారణ చేపట్టారు.


విచారణ చేపడుతున్న డీఎల్‌పీవో శంకర్‌నాయక్

ఘనంగా మంత్రి కోమటిరెడ్డి జన్మదిన వేడుకలు


నల్లగొండ: కేక్ కట్ చేస్తున్న గుమ్మల మోహన్‌రెడ్డి, బుర్రి శ్రీనివాస్‌రెడ్డి


మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ కౌన్సిలర్ మారగోని నవీన్‌కుమార్‌గౌడ్, చిత్రంలో మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి

నల్లగొండ: రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి జన్మదినం సందర్భంగా శుక్రవారం నల్లగొండలోని క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ నల్లగొండ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్ రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్య, అబ్బగోని రమేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నార్కట్‌పల్లి : మంత్రి కోమటిరెడ్డి జన్మదిన వేడుకలు నార్కట్‌పల్లి మండలంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బత్తుల ఉషయ్య, వడ్డే భూపాల్‌రెడ్డి, దూదిమెట్ల సత్తయ్య, ఐతరాజు యాదయ్య, జేరిపోతుల భారత్ తదితరులు పాల్గొన్నారు.

చిట్యాల: మంత్రి కోమటిరెడ్డి జన్మదిన వేడుకలను చిట్యాలలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ మాజీ చైర్మన్ కోమటిరెడ్డి చినవెంకట్‌రెడ్డి, డీసీసీ కార్యదర్శి పోకల దేవదాస్ కేక్ కట్ చేశారు. మాజీ జెడ్పీటీసీ శేపూరి యాదయ్య, ఏఎంసీ మాజీ చైర్మన్ కాటం వెంకటేశం, పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు గుడిపాటి లక్ష్మీనర్సింహ, జడల చినమల్లయ్య పాల్గొన్నారు.

నకిరేకల్ : మండలంలోని తాటికల్ లయన్స్ వృద్ధాశ్రమంలో కాంగ్రెస్ నేత ధైద రవీందర్ ఆధ్వర్యంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా వృద్ధులతో కలిసి కేక్ కట్ చేసి అన్నదానం, పండ్లు పంపిణీ చేశారు.


దర్వేశిపురం రేణుకా ఎల్లమ్మ ఆలయం ఎదుట కేక్ కట్ చేస్తున్న నాయకులు

తిప్పర్తి : మంత్రి కోమటిరెడ్డి జన్మదిన వేడుకలను తిప్పర్తి మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో నాగులవంచ విజయలక్ష్మిలింగారావు, జూకూరి రమేష్, పాశం సంపత్‌రెడ్డి, చింతకుంట్ల రవీందర్‌రెడ్డి, బద్దం సుధీర్ పాల్గొన్నారు.

కేతేపల్లి: మంత్రి కోమటిరెడ్డి జన్మదిన వేడుకలను కేతేపల్లిలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కె.శ్రీనివాస్ యాదవ్, బొజ్జ సుందర్, జటంగి వెంకటనర్సయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు

కనగల్: మంత్రి కోమటిరెడ్డి జన్మదినం సందర్భంగా దర్వేశిపురం రేణుకా ఎల్లమ్మ ఆలయంలో కాంగ్రెస్ నాయకులు పూజలు చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు గడ్డం అనూప్‌రెడ్డి, ఆలయ చైర్మన్ చిదేటి వెంకట్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ నర్సింగ్ శ్రీనివాస్‌గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ జి.భిక్షంయాదవ్ పాల్గొన్నారు.


తిప్పర్తి : కేక్ కట్ చేస్తున్న నాయకులు

శాలిగౌరారం: మంత్రి కోమటిరెడ్డి జన్మదిన వేడుకలను మండలకేంద్రంలో నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కందాల సమరంరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ పాదూరి శంకర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ తాళ్ళూరి మురళి, వైస్ చైర్మన్ నరిగె నర్సింహ పాల్గొన్నారు.

వాల్ పోస్టర్ ఆవిష్కరణ

నాంపల్లి : తెలంగాణ జర్నలిస్టు ఫోరం 25 వసంతాల వారోత్సవాలు ఈ నెల 31వ తేదీన హైదరాబాద్‌లోని జలవిహార్‌లో నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గాలెంక గురుపాదం తెలిపారు. శుక్రవారం నాంపల్లి మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో వారోత్సవాలకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. వారోత్సవాల్లో జర్నలిస్టులు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు గడ్డం వెంకటేశ్వర్లు, నియోజకవర్గ ఉపాధ్యక్షుడు కామిశెట్టి యాదయ్య, మండల గౌరవ అధ్యక్షుడు కోట అయోధ్య, వినోద్‌కుమార్, శేఖర్, రవీందర్, లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

భవిత కేంద్రం పరిశీలన


భవిత కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఈఓ భిక్షపతి

చిట్యాల: పట్టణంలోని భవిత విద్యావనరుల కేంద్రాన్ని శుక్రవారం డీఈఓ బి.భిక్షపతి సందర్శించారు. భవిత కేంద్రంలోని సమస్యలు, అసంపూర్తిగా ఉన్న పనులను ఎంఈఓ పానుగోతు సైదానాయక్‌ను అడిగి తెలుసుకున్నారు. భవిత కేంద్రంలో విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా అదనపు గది ఏర్పాటు చేయాలని డీఈఓ సూచించారు. అనంతరం డీఈఓ భిక్షపతితో పాటు ఏఎస్‌పీడీ(ఎస్ఎస్ఏ) రాధారెడ్డి స్థానిక ఎంఈఓ కార్యాలయంలో ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమాన్ని వేర్వేరుగా పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బడి బాట కార్యక్రమాన్ని సక్రమంగా నిర్వహించి పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలని సూచించారు. వారి వెంట రిసోర్స్ పర్సన్స్ కరుణాకర్, అశోక్‌రెడ్డి, అంజయ్య, రెహానా కౌసర్, విజయ్‌కృష్ణ, భవిత కేంద్రం ఐఆర్‌పీ గీత ఉన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్లు ఇలా.. విద్యుత్ సరఫరా జరిగేదెలా!

- కంప చెట్ల మధ్యలో ట్రాన్స్‌ఫార్మర్లు
- తరచూ విద్యుత్ సరఫరాలో అంతరాయం
- కాలిపోతున్న ఇళ్లల్లోని ఎలక్ట్రానిక్ పరికరాలు
- ఇబ్బందులకు గురవుతున్న ప్రజలు

శాలిగౌరారం: అసలే వేసవి కాలం.. ఆపై విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం.. ప్రస్తుతం ఇంట్లో ఫ్యాన్ తిరగకపోతే నిమిషం కూడా ఇంట్లో ఉండలేని పరిస్థితి. విద్యుత్ అధికారుల నిండు నిర్లక్ష్యం వినియోగదారులకు ఇబ్బందులను తెచ్చిపెడుతోంది. శాలిగౌరారం మండలంలోని అనేక గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం కలుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో విద్యుత్ వినియోగదారులు ఇబ్బందులు ఎదుర్కోక తప్పడంలేదు.

ట్రాన్స్‌ఫార్మర్లను కమ్మేసిన కంపచెట్లు

శాలిగౌరారం మండలంలోని అనేక గ్రామాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను కంపచెట్లు కమ్మేశాయి. దీంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోంది. వేసవి కాలం కావడంతో విద్యుత్ అంతరాయంతో ప్రజలు బాధలు వర్ణణాతీతం. విద్యుత్ సరఫరాలో ఏర్పడుతున్న అంతరాయాల వల్ల ఇళ్లలోని విలువైన ఎలక్ట్రానిక్ పరికరాలు దెబ్బతింటుండడంతో ప్రజలు నష్టపోక తప్పడంలేదు.

మండల కేంద్రంలో ఇలా..

మండల కేంద్రంలోని శాలిగౌరారం–గురుజాల ప్రధాన రోడ్డువెంట ఉన్న ఎస్ఎస్–12 నంబర్ గల 100 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంపచెట్లు దట్టంగా పెరగడంతో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కనిపించకుండా మారింది. ట్రాన్స్‌ఫార్మర్‌ను కంపచెట్ల కొమ్మలు తగిలి షార్ట్‌సర్క్యూట్ కావడంతో తరచూ ఫ్యూజ్ కొట్టివేస్తోంది. ఈ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు ఆన్‌ఆఫ్ చేసేందుకు ఏబీ స్విచ్ కూడా లేకపోవడం గమనార్హం. ఈ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పరిధిలో మండల కేంద్రంలోని మార్కెట్ కాలనీకి తాగునీటిని అందించే గ్రామపంచాయతీకి చెందిన బోరుతోపాటూ మరో 15 వ్యవసాయ బోరుబావులు ఉన్నాయి. ట్రాన్స్‌ఫార్మర్‌పై ఫ్యూజ్ వేయాలంటే విద్యుత్ సిబ్బంది విద్యుత్ సబ్‌స్టేషన్‌లో శాలిగౌరారం, మార్కెట్ విద్యుత్ ఫీడర్లకు ఎల్‌సి తీసుకొని మాత్రమే ఫ్యూజ్ వేయాల్సి వస్తుంది. కొన్ని సందర్భాల్లో విద్యుత్ సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో వారు వచ్చే వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుంది. దీంతో తాగునీటి కోసం మార్కెట్‌కాలనీ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవలసిన పరిస్థితి.


శాలిగౌరారంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ పెరిగిన కంపచెట్లు

పట్టించుకోని విద్యుత్ సిబ్బంది..

ఆకారం గ్రామానికి విద్యుత్ సరఫరా జరిగే గ్రామ ప్రధాన కూడలిలో విద్యుత్ స్తంభానికి ఏర్పాటు చేసి ఉన్న సింగిల్ ఫేజ్ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఒక వైపు కంపచెట్లు, మరోవైపు తీగజాతి మొక్కలు అల్లుకుపోవడంతో గ్రామానికి విద్యుత్ సరఫరా సక్రమంగా జరగడంలేదు. ట్రాన్స్‌ఫార్మర్ తరచూ ట్రిప్ కావడం, ఫ్యూజ్ పోతుండడంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. విద్యుత్ సరఫరా ఎప్పుడు జరుగుతుందో, ఎప్పుడు నిలిచిపోతుందో అర్థంగానీ పరిస్థితి . ఈ విషయాన్ని విద్యుత్ సిబ్బంది దృష్టికి తీసుకుపోయినప్పటికీ పట్టించుకోవడం లేదంటూ ప్రజలు వాపోతున్నారు. ఉన్నతాధికారులు చర్యలు తీసుకొని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ ఉన్న కంపచెట్లను తొలగించి ట్రాన్స్‌ఫార్మర్లపై ఫ్యూజ్‌పోకుండా చూడడంతోపాటూ ట్రాన్స్‌ఫార్మర్లకు ఆన్‌ఆఫ్‌కు సంబంధించిన ఏబీ స్విచ్‌లను అమర్చాలని వినియోగదారులు కోరుతున్నారు.


ఆకారంలో సింగిల్‌ఫేజ్ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను అల్లుకుపోయిన కంపచెట్లు, తీగజాతి మొక్కలు

ఎలక్ట్రానిక్ పరికరాలు కాలిపోతున్నాయి



ఆకారం గ్రామంలో విద్యుత్ సరఫరాకు ప్రతి రోజు అంతరాయం ఏర్పడుతోంది. ఎప్పుడు కరెంట్ ఉంటదో, ఎప్పుడు పోతదో తెలియడం లేదు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను కంపచెట్లు పూర్తిగా అల్లుకుపోయాయి. నిత్యం వచ్చి పోయే కరెంట్‌తో ఇళ్లలోని విలువైన ఎలక్ట్రానిక్ పరికరాలు కాలిపోతున్నాయి.

– జువాజి నాగరాజు, ఆకారం

పర్యావరణాన్ని కాపాడాలి

కనగల్: ప్లాస్టిక్ వ్యర్థాలను నియంత్రించి పర్యావరణాన్ని కాపాడాలని డీఎల్‌పీఓ వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం కనగల్‌లో ప్లాస్టిక్ నియంత్రణపై పంచాయతీ కార్యదర్శులకు, గ్రామ పంచాయతీ వర్కర్లకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్లాస్టిక్ వాడకం వల్ల వచ్చే పర్యావరణ సమస్యలను వివరించారు. గ్రామాలను ప్లాస్టిక్ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ టి.జయరాం, ఎంపీఓ కె.సుమలత, అండాలు, వీరబాబు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

నార్కట్‌పల్లి : చెరువుగట్టు ప్రభుత్వ పాఠశాలలో మాజీ సర్పంచ్ మల్లు బాలకృష్ణ ఆధ్వర్యంలో శుక్రవారం కామినేని ఆస్పత్రి సహకారంతో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. దాదాపు రెండు వందల మందికి ఈసీజీ, బీపీ, షుగర్, గ్యాస్ట్రిక్ తదితర పరీక్షలు నిర్వహించి అవసరం ఉన్న వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కామినేని మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మణ్‌సింగ్, కూడగి ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాంమోహన్‌రావు, కమ్యూనిటీ మెడిసిన్ హెచ్‌ఓడీ డాక్టర్ మారుతిశర్మ, క్యాంపు ఇన్‌చార్జ్ డాక్టర్ హర్షిత, డాక్టర్ శంకర్, డాక్టర్ మౌనిక, అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ విష్ణుప్రియ, హెల్త్ అసిస్టెంట్ నగేష్, పీఆర్‌ఓ చంద్రశేఖర్, గోపాల్, స్వామి, యాదగిరిరెడ్డి, సైదులు, ఓంప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

ఆరాధన వేడుకలు


ప్రవచనాలు వినిపిస్తున్న కృష్ణమూర్తి

నకిరేకల్ : పట్టణంలోని అచల గురుమందిరంలో శుక్రవారం పూర్ణానంద పాండరమ్మ మాతాజీ చతుర్థ వార్షిక ఆరాధన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆమె ఛాయా చిత్రపటంతో పట్టణ వీధులు గుండా ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా గురువు మిట్టపల్లి కృష్ణమూర్తి తన ప్రవచనాలు వినిపించారు. పాండరమ్మ సమాజ సేవ కార్యక్రమాలను వివరించారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు. అచలనంద షేక్ మహ్మద్ అబ్బాస్ అధ్యక్షతన జరిగిన ఈవేడుకల్లో నిర్వాహకులు కాసం దయానందం, గాంధీ, మధుసూదన్, కోటగిరి రమాశ్రీనివాస్, గుండా అనసూయ, శివకోటి ఆంజనేయులు, సోమనాథం పాల్గొన్నారు.